# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక






సంపుటి :12 సంచిక :249 గురువారం 16-4-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/


## కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు

- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిది
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు



2 లో

## మళ్లీ తోక జాడిస్తున్న పాక్..

- భారత్లో చూడబడినందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం..
- భారత్లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు భారీ కుట్ర
- సరిహద్దుల్లో 70 ఉగ్రవాదం లాంచ్ ప్యాడ్ల పునరుద్ధరణ
- భారత్ లో ఎన్నికలు, మధ్యప్రాచ్య సంక్షోభమే పాక్కు అదును ..
- కొత్త వ్యూహంతో ఒకేసారి పలుచోట్ల నుంచి చొరబాట్లకు ప్లాన్



2 లో




## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

- మొదటి సంవత్సరంలో 77 శాతం
- రెండో సంవత్సరంలో విద్యార్థులు 81 శాతం పాస్
- ఫలితాల్లో అమ్మాయిలదే హవా

**అమరావతి,**

ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 77 శాతం పాస్ అయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్‌తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలనువెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. మెసేజ్‌ను 9552300009 నంబర్‌కు వాట్సాప్‌లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి -మిగతా 2 లో


# డీలిమిటేషన్ పై హై టెన్షన్

**నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు**

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత
- ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు
- వాడీవేడీగా సాగనున్న సమావేశాలు

**న్యూఢిల్లీ**

పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు -మిగతా 2 లో




## పునర్విభజన జనాభా ప్రకారమే

- రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే
- సిఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**వరంగల్,**

: నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు -మిగతా 2 లో



## దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు లేవు


- అధికారికంగా ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ,**

దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు ఏవీ లేవని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారిక ప్రకటనలో తెలియజేసింది. భారత దేశంలో వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యూఈ) ఉద్భవించి ఐదు దశాబ్దాలకు పైగా గడిచిందని, ప్రస్తుతం వారి ప్రభావం దేశంలో ఎక్కడా లేదని కేంద్రం తెలిపింది.దేశంలో నక్సల్స్ ప్రభావం ఉన్న తొమ్మిది రాష్ట్రాలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని తెలిపిందని అధికారులు వెల్లడించారు. 'దేశంలోని ఏ జిల్లా కూడా ఇకపై ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత క్యాటగిరీలో లేదు' అని ఆ ప్రకనటలో పేర్కొన్నది. కాగా, దేశాన్ని మావోయిస్టు రహితంగా తీర్చిదిద్దినట్టు హోం మంత్రి అమిత్ షా మార్చి 30న పార్లమెంట్‌లో ప్రకటించారు. -మిగతా 2 లో

## తెలంగాణలో భగ్గుమంటున్న భానుడు

- పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం
- వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీ



**హైదరాబాద్,**

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, -మిగతా 2 లో

## నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం

-మిగతా 2 లో

- దేశవ్యాప్తంగా డీలిమిటిటేషన్ సెగలు
- తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాల ప్రదర్శనకు పిలుపు



**చెన్నై**

దేశ రాజకీయాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు హాట్ టాపిక్ అయింది. గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాలు మిశ్రమ గళాన్ని వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. -మిగతా 2 లో

# కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్‌సిగ్నల్

**ఒకట్రెండు రోజుల్లో జీవో**



- మీనాక్షి నటరాజన్‌తో భేటీలో సీఎం నిర్ణయం
- పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటూ పీసీసీ చీఫ్‌నకు విజ్ఞప్తి

**హైదరాబాద్**

అధికార పార్టీలోని ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కార్పొరేషన్ చైర్మెన్లు, పాలక మండళ్లకు సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. కాకపోతే ప్రస్తుతానికి నాయిబ్రాహ్మణ, పద్మశాలి, రజక తదితర కులాలకు చెందిన కార్పొరేషన్లలోని పోస్టులనే భర్తీ చేయనున్నారు. -మిగతా 2 లో



## మహిళా బిల్లుకు ఓకే ... డీలిమిటేషన్ బిల్లుకు నో

- రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోంది
- డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతాం
- వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే

**న్యూఢిల్లీ,**

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. -మిగతా 2 లో



## దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

- మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు
- నియోజకవర్గాల పునర్విభజనతో ముడి పెట్టడానికి వ్యతిరేకం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్**

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా అన్యాయం చేస్తే పెను ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఆయన ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే అది కేవలం రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదనీ, -మిగతా 2 లో

Journalist dairy

గురువారం
16-04-2026

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిది
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్,**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## పునర్విభజన జనాభా ప్రకారమే

మొదటి తరువాయి

సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రాంచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ పక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన పక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి తరువాయి

సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్ఠి కృషి వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 85శాతంగా నమోదయ్యింది. ప్రథమ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 81శాతంగా నమోదు అయ్యింది. రీకౌంటింగ్ / రీవెరిఫికేషన్ దరఖాస్తులలను ఏప్రిల్ 20 నుంచి 27 వరకు వరకు స్వీకరిస్తారు. స్కాన్ కాపీతో రీవెరిఫికేషన్‌కు అవకాశం ఉంది. సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుంచి జూన్ 4 వరకు థియరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకు ప్రాక్టికల్స్ రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ ఉంటుంది. మొదటి సంవత్సరం పాస్ అయిన వారికి ఇంప్రూవ్‌మెంట్‌కు ఛాన్స్ ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పూర్తి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తిరిగి కృషి చేసి విజయం సాధించాలని వారికి పిలుపు ఇచ్చారు. ఈ సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక బలం ఇవ్వాలని, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని విజయాలు సాధించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

## దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు లేవు

మొదటి తరువాయి

దేశంలో నక్సలిజాన్ని మార్చి 31నాటికి అంతం చేయాలనే లక్ష్యంతో కేంద్రం నిర్వహించిన ఆపరేషన్ విజయవంతమైందని ఆయన చెప్పారు.

## తెలంగాణలో భగ్గుమంటున్న భానుడు

మొదటి తరువాయి

మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది.నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

## నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం

మొదటి తరువాయి

స్టాలిన్ కేంద్ర తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ పక్రియను దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న 'చారిత్రక అన్యాయం'గా స్టాలిన్ అభివర్ణించారు. 'కేంద్ర ప్రభుత్వం నిప్పుతో చెలగాటం ఆడుతోంది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా?' అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా లబ్ధి చేకూర్చి, దక్షిణాది ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా నేడు తమిళనాడు వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన తెలపాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇంటింటిపై నల్లజెండాలు ఎగురవేయాలని రాష్ట్ర ప్రజలను స్టాలిన్ కోరారు. 'తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది' అంటూ ఆయన ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల లోకసభ సీట్లు తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరుగుతాయన్నది సీఎం స్టాలిన్ అభియోగం. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల గొంతు నొక్కడం సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని, ఇప్పుడు రాజకీయంగా కూడా మొండిచేయి ఎదురవుతుందని ఆయన వాదిస్తున్నారు. దక్షిణాది ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్రం ఈ బిల్లును ఉపసంహరించుకోకపోతే భారీ మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు. మరోవైపు, రేపు పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న తరుణంలో విపక్షాలు ఐక్య పోరాటానికి సిద్ధమవుతున్నాయి. రాజ్యాంగ విలువలు, సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలని కోరుతూ గళం ఎత్తేందుకు సిద్ధమయ్యాయి.

# మళ్లీ తోక జాడిస్తున్న పాక్..

- భారత్లో చూడబడినందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం..
- భారత్లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు భారీ కుట్ర
- సరిహద్దుల్లో 70 ఉగ్రవాదం లాంచ్ ప్యాడ్ల పునరుద్ధరణ
- భారత్ లో ఎన్నికలు, మధ్యప్రాచ్య సంక్షోభమే పాక్కు అదును ..
- కొత్త వ్యూహంతో ఒకేసారి పలుచోట్ల నుంచి చొరబాట్లకు ప్లాన్



జమ్మూకశ్మీర్ లో మరోసారి అలజడి సృష్టించడం కోసం పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదుల ను భారత్‌లోకి పంపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం కలిసి ఈ ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు (బుధవారం) హెచ్చరించాయి. ఉగ్రవాదులను చొప్పించడం కోసం పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంబడి, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉంది. అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇదే అదునుగా భావించి పాకిస్థాన్ ఈ కుట్రకు పాల్పడుతోందని నిఘా విభాగానికి చెందిన ఓ అధికారి తెలిపారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం ఉన్నట్లు వెల్లడించారు. అయితే ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దాంతో పాకిస్థాన్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున గ్రూపులుగా ఉగ్రవాదులను పంపి భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని పాకిస్థాన్ చూస్తోంది. ఇలాచేస్తే కొందరైనా భారత్‌లోకి చొరబడగలరని పాకిస్థాన్ భావిస్తోంది. గత ఏడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దాంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్ఐపై ఒత్తిడి వస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ యోచిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

# డీలిమిటేషన్ పై హై టెన్షన్

మొదటి తరువాయి

వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించు కోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది

# కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్‌సిగ్నల్

మొదటి తరువాయి



ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో సీఎం బుధవారం కీలక సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో దాదాపు నాలుగు గంటలపాటు వారు పలు అంశాలపై చర్చించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, కార్యదర్శులు, ఇతర ఆర్గనైజర్ల పోస్టుల భర్తీపై కూడా వారు సమాలోచనలు చేసినట్టు తెలిసింది. మండల, బూత్ లెవల్ కమిటీల ఏర్పాటుపై సైతం వారు చర్చించారు. కేంద్రం చేపడుతున్న నియోజకవర్గాల పునర్ విభజన, రాష్ట్రానికి జరగబోయే నష్టం గురించి ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. కాంగ్రెస్ సంస్థాగత విషయాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా త్వరలోనే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)ని నిర్వహించాలంటూ ఆయన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా కార్పొరేషన్లతోపాటు పార్టీ పదవులను భర్తీ చేసేటప్పుడు క్రియాశీలకంగా ఉన్న జిల్లాలు, అక్కడి సామాజిక సమీకరణాలు, పార్టీ కోసం పనిచేసిన నేతలు తదితరాంశాలపై జాబితాను రూపొందించాలంటూ సీఎం సూచించారు. ఒక్కో ఆశవహుడి పేరును ప్రస్తావిస్తూ ఆయన చర్చించారు. 'ఒక్కరికి కేవలం ఒక పదవే...' అనే సూత్రాన్ని పక్కాగా, తూ.చా. తప్పకుండా పాటించాలంటూ కోరారు. ఇదే విధంగా భవిష్యత్ అవసరలను దృష్టిలో ఉంచుకుని సామాజిక సమీకరణాలు, పొందికలపై దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే కార్పొరేషన్ చైర్మెన్లు, ప్రభుత్వ సలహాదారుల పోస్టుల కోసం వందలాది మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఆ జాబితాను సాధ్యమైనంతగా వడబోసి, పార్టీకి విధేయులుగా ఉండి, ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం పని చేసి, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించాలని సీఎం భావిస్తున్నారు. వారిలోంచి మొదటి దఫాగా 20 నుంచి 25 మందికి పదవులను కట్టబెట్టాలని ఆయన నిర్ణయించారు. ఇదే సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక తరగతులకు ప్రాధాన్యతనిస్తూనే రెడ్డి సామాజిక తరగతిని కూడా 'సంతృప్తి' పరిచే విధంగా జాబితాలను సిద్ధం చేయాలని సీఎం... పీసీసీ చీఫ్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో కనీసం 30 శాతం మహిళలకు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

మొదటి తరువాయి

మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. మూడేండ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమనీ, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని పేర్కొన్నారు. జనాభా నియంత్రణతోపాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రాతినిధ్యాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. "ఢిల్లీ పాలకులు తమ మాట వినాలనీ, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మొదటి నుంచి చిత్తశుద్ధితో సంపూర్ణ మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడమే కాకుండా, అసెంబ్లీ, శాసన మండలిలో ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేసిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, మార్కెట్ కమిటీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా మహిళా సాధికారత పట్ల తమకున్న అచంచలమైన నిబద్ధతను చాటుకున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లను నియోజక వర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ లతో ముడిపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అత్యంత సరళమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు సంక్లిష్టం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలనీ, పార్లమెంటులో 543 సీట్లు ఉన్నాయనీ, వాటికి వర్తింపజేయాలని సూచించారు.

## మహిళా బిల్లుకు ఓకే ... డీలిమిటేషన్ బిల్లుకు నో

మొదటి తరువాయి

ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు.

జర్నలిస్ట్ డైరీ తెలుగు దినపత్రిక

## దవాఖాన నిర్లక్ష్యం.. పాక్‌లో331 మంది పిల్లలకు హెచ్ఐవీ!

**బీబీసీ కథనం.. ఖండించిన పాక్**



**ఇస్లామాబాద్ ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ డైరీ) :**
పాకిస్థాన్‌లోని తౌన్సా నగరంలో ఓ ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల 331 మంది పిల్లలకు హెచ్ఐవీ సోకిందని బీబీసీ దర్యాప్తులో తేలింది. నవంబర్ 2024–అక్టోబర్ 2025 మధ్య కాలంలో ఈ వైరస్ వ్యాప్తి చెందినట్టు తెలిపింది. సురక్షితం కాని సూదులు వాడటం, సిరంజీలు, వయల్స్ వాడినవే వాడటం వల్ల హెచ్ఐవీ ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందినట్టు వెల్లడించింది.ఒకే వయల్‌లోని మందును పలువురు చిన్నారులకు ఎక్కించారని వివరించింది. సిరంజీని మార్చకుండా వాడినప్పుడు హెచ్ఐవీ సంక్రమించే అవకాశం ఉందని.. ఇది ప్రమాదకరమని నిపుణులు తెలిపారు. ఇంజెక్షన్లను వేడి నీళ్లలో శుభ్రపరచకుండా వాడినట్టు దర్యాప్తులో తేలింది. 8 ఏండ్ల మొహమ్మద్ అమిన్ అనే పిల్లాడు చనిపోవడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. అయితే దవాఖాన అధికారులు ఈ ఆరోపణలను ఖండించారు. బీబీసీ ఫుటేజీ పాతది లేదా బూటకమైనది కావొచ్చన్నారు. తాము సరైన నియమావళిని పాటిస్తున్నామన్నారు.

## బీహార్ ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ప్రమాణం

**మరో ఇద్దరు మంత్రులు కూడా..**



**పాట్నా ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ డైరీ) :**
బీహార్ నూతన ముఖ్యమంత్రిగా బిజెపి నాయకులు సామ్రాట్ చౌదరి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. పాట్నాలోని లోక్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సామ్రాట్ చౌదరి చేత గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ప్రమాణస్వీకారం చేయించారు. అలాగే, జెడి(యు) సీనియర్ నాయకులు బిజేంద్ర ప్రసాద్ యాదవ్, విజయ్ కుమార్ చౌదరీ కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. బహుశా ఈ ఇద్దరు నాయకులు ఉపముఖ్యమంత్రులుగా వ్యహరిస్తారని భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్య మంత్రి నితీష్‌కుమార్‌తో పాటు బిజెపి జాతీయ అధ్యక్షులు నితీన్ నబిన్, కేంద్ర మంత్రులు జెపి నడ్డా, బిజెపి, జెడి(యు) నాయకులు పాల్గొన్నారు.

## కన్యాకుమారి రోడ్ షోలో పాల్గొన్న మోడీ



**కన్యాకుమారి ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ డైరీ) :**
ఏప్రిల్ 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగున్నాయి. ఈ నేపథ్యంలో కన్యాకుమారి జిల్లాలో నాగర్‌కోయిల్‌లో బుధవారం జరిగిన రోడ్ షోలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఆయన వెంట తమిళనాడు బిజెపి అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి ఉన్నారు. ఈ సందర్భంగా నాగర్‌కోయిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మోడీ నివాళులర్పించారు.

## ఇరాన్‌లో 1,104 గంటలుగా ఇంటర్నెట్ నిలిపివేత



**టెహ్రాన్ ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ డైరీ) :**
: అమెరికా -- ఇజ్రాయిల్ దాడుల వల్ల ఇరాన్ అతలాకుతలమవుతుంది. యుద్ధం ప్రారంభమై 47 రోజులవుతుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,104 గంటలుగా ఇరాన్‌లో ఇంటర్నెట్ నిలిచిపోయింది. దీంతో ప్రజలకు అంతర్జాతీయ కనెక్టివిటీ లేకుండా తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ మేరకు ఇంటర్నెట్ పర్యవేక్షక సంస్థ నెట్ బ్లాక్ తెలిపింది. ఇరాన్‌పై దాడులకు పాల్పడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ ఏడాది జనవరిలో హెచ్చరించాడు. ఆ నేపథ్యంలోనే డిజిటల్ సదుపాయం క్షీణించింది. ఆ తర్వాత ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం వల్ల అప్పటి నుంచి పూర్తిగా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం అంతర్గత నెట్‌వర్క్‌లు పనిచేస్తున్నప్పటికీ.. అంతర్జాతీయ డిజిటల్ సేవలకు అంతరాయమేర్పడింది.

# మా గళం వినిపించుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయ్..


**-డీలిమిటేషన్‌పై కేంద్రానికి స్టాలిన్ స్ట్రాంగ్ వార్నింగ్**



**న్యూఢీల్లీ ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ డైరీ) :**
నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు ద్రోహం చేస్తోందని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంలో తమిళనాడు గళాన్ని వినిపించుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు.దేశం అభివృద్ధికి కృషి చేసిన నేరానికి కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తుందా..? అని స్టాలిన్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. రేపు పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని చూస్తున్న డీలిమిటేషన్ సవరణ బిల్లుపై దక్షిణ భారత ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని స్టాలిన్ అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు నిరసనగా రేపు రాష్ట్రవ్యాప్తంగా నల్ల జెండాలతో నిరసనలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గాల అశాస్త్రీయ పునర్విభజనను తాము వ్యతిరేకిస్తూనే ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తెరపైకి తీసుకురావడం కుట్రపూరిత చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లు పేరుతో పార్లమెంట్‌లో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించేందుకు కేంద్ర సర్కారు ప్రయత్నిస్తోందని అరోపించారు.

# అండమాన్ సముద్రంలో ఘోర ప్రమాదం..

**పడవ మునిగి 250 మంది గల్లంతు**



**న్యూఢీల్లీ ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ డైరీ) :**
అండమాన్ సముద్రం లో ఘోర ప్రమాదం జరిగింది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తున్న ఓ పడవ నీటిలో మునిగిపోయింది . ఈ ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వారిలో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది.ప్రమాదానికి గురైన పడవ దక్షిణ బంగ్లాదేశ్‌లోని టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఐక్యరాజ్య సమితి తన ప్రకటనలో పేర్కొన్నది. పడవ బంగ్లాదేశ్ నుంచి మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించింది. అదేవిధంగా పడవలో పరిమితికి మించి జనం ఎక్కడం కూడా ప్రమాదానికి మరో కారణమై ఉండవచ్చని తెలిపింది. మునిగిన పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదానికి గురైనట్లు ఐక్యరాజ్యసమితి అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు మయన్మార్‌కు చెందినవారు. కానీ 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది మంది బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దాంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే ఇటీవల అక్కడి పరిస్థితులు కూడా క్షీణించడంతో వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను వారు ఎంచుకుంటున్నారు.

# నాటో కూటమి గతంలో లేదు.. భవిష్యత్తులో కూడా ఉండదు



**న్యూఢీల్లీ ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ డైరీ) :**
ఇరాన్ తో యుద్ధం చేసే విషయంలో, హర్మూజ్ జలసంధి ని తిరిగి తెరిపించే విషయంలో నాటో కూటమి నుంచి ఎలాంటి సాయం అందకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ కూటమిపై ఇప్పటికే అనేకసార్లు విరుచుకుపడిన ఆయన.. తాజాగా మరోసారి ట్రూత్ సోషల్ వేదికగా విమర్శలు చేశారు. నాటో అమెరికాకు ఎప్పుడూ మద్దతుగా నిలువలేదని మండిపడ్డారు.అమెరికాకు అవసరమైనప్పుడు ఎప్పుడూ నాటో కూటమి అండగా లేదని, భవిష్యత్తులోనూ దాని నుంచి తమకు ఎలాంటి మద్దతు లభించదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ దృష్టిలో నాటో కూటమి గతంలో లేదు, భవిష్యత్తులో ఉండబోదని అసహనం వ్యక్తంచేశారు. కాగా గత కొన్నిరోజులుగా నాటోపై ట్రంప్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఇటీవల కూడా నాటో కూటమిని ఒక కాగితపు పులిగా అభివర్ణించారు. కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు సంచలన ప్రకటన చేశారు. మరోవైపు అమెరికాలో జన్మించిన తొలి పోప్ లియో–14 (గ్రాశీజూవ గావశీ), అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య జగడం మరింత ముదురుతోంది. పోప్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ మంగళవారం ఓ పోస్టు పెట్టారు. గత రెండు నెలల్లో ఇరాన్ దాదాపు 42 వేల మంది అమాయకులైన నిరసనకారులను బలిగొన్నదని ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ దేశం వద్ద అణ్వాయుధాలు ఉండటం సరైనది కాదని ఉద్ఘాటించారు. ఈ విషయం పోప్ లియోకు అర్థమయ్యేలా ఎవరైనా చెప్పాలంటూ ఎద్దేవా చేశారు.పశ్చిమాసియా యుద్ధంపై పోప్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ఘాటుగా స్పందించారు. దాంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నాటో నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. యూరప్ ప్లాన్ బీపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ అమెరికా కూటమి నుంచి వైదొలిగితే.. ప్రస్తుత సైనిక వ్యవస్థలను ఉపయోగించి తనను తాను రక్షించకోగలిగే ఒక ప్రత్యామ్నాయ ప్రణాళికను యూరప్ రూపొందిస్తున్నదని మీడియాలో కథనాలు వస్తున్నాయి. 'యూరోపియన్ నాటో' పేరుతో ఈ ప్రతిపాదనపై అధికారులు కృషి చేస్తున్నట్లు కథనాలు వెలువడ్డాయి.

# నెలసరి సెలవును -కచ్చితంగా, విశ్వసనీయం'గా అమలు చేయాలి




**బెంగళూరు ఏప్రిల్ 15 (జర్నలిస్ట్ డైరీ) :**
నెలసరి సెలవును -కచ్చితంగా, విశ్వసనీయంగా' అమలు చేయాలని కర్ణాటక హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నెలసరి సెలవు(ఎంఎల్)పై ప్రతిపాదిత చట్టం అమల్లోకి వచ్చే వరకు, 18 నుండి 52ఏళ్ల వయస్సుగల మహిళా ఉద్యోగులకు నెలసరి సమయంలో ఒక రోజు సెలవును మంజూరు చేయడాన్ని తప్పనిసరి చేసే ఎంల్ విధానాన్ని సంబంధిత సంస్థలు కచ్చితంగా, విశ్వసనీయంగా అమలు చేసేలా చూడాలని ఆదేశించింది. బెళగావి జిల్లా, గోకాక్ తాలూకా ముదల్గిలోని ఒక హోటల్ లో పనిచేస్తున్న 41ఏళ్ల చంద్రవ్వ హనుమంత్ గోకవి దాఖలు చేసిన పిటిషన్ పై జస్టిస్ ఎం.నాగప్రసన్న ఈ ఉత్తర్వును జారీ చేశారు. కర్ణాటక నెలసరి సెలవు, పరిశుభ్రత బిల్లు, 2025 ప్రతిపాదిత చట్టంగా ఆమోదం పొందిన వెంటనే ఈ ఆదేశాన్ని పూర్తిస్థాయిలో, అర్థవంతంగా అమలు చేసేందుకు ఎటువంటి అనవసర జాప్యం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన నిబంధనలను రూపొందించాలని కోర్టు పేర్కొంది. ఆర్టికల్ 14ను లోతుగా విశ్లేషించకుండా ఇచ్చిన ప్రస్తావన ఆధారంగా ఏర్పడిన నిరాధారమైన భయాలతో రాష్ట్రం వెనకడుగు వేయకూడదని లేదా పరిమితం కాకూడదని కోర్టు పేర్కొంది. చట్టం దృష్టిలో స్త్రీ పురుషులు సమానులే, కాని వారు జీవశాస్త్ర పరంగా విభిన్నమైన వారు. ముఖ్యంగా ఆరోగ్యం, గౌరవం, శారీరక స్వేచ్ఛకు సంబంధించిన విషయాలను గుర్తించడం అనేది సమానత్వ హామీని ఉల్లంఘించడం కాని, దానికి ఒక వాస్తవిక అర్థాన్ని ఇవ్వడమే అవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఫ్యాక్టరీల చట్టం, 1948, కర్ణాటక దుకాణాలు, వాణిజ్యసంస్థల చట్టం, 1961, తోట కార్మికుల చట్టం, 1951, బిడి,సిగార్ కార్మికుల (ఉద్యోగ నిబంధనల) చట్టం,1966, మోటారు రవాణా కార్మికుల చట్టం, 1961కింద నమోదైన సంస్థల్లోని శాశ్వత, కాంట్రాక్ట్ , అవుట్ సోర్స్ మహిళా ఉద్యోగులందరికి ఎంఎల్ అందుబాటులో ఉంటుందని గతేడాది నవంబర్ 20న జారీ చేసిన నోటిఫికేషన్ పేర్కొంది. ఈ నోటిఫికేషన్ చట్టబద్ధతను సవాలు చేస్తూ బెంగళూరు హోటల్స్ అసోసియేషన్, కర్ణాటక ఎంప్లాయర్స్ అసోసియేషన్, బెంగళూరు ఎంప్లాయర్స్, 15మంది మహిళా ఉద్యోగులు పిటిషన్లు దాఖలు చేశారు. ఎంఎల్ విధానానికి మద్దతు ఇస్తూ వివిధ ట్రేడ్ యూనియన్లు, మహిళా న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్లు కోర్టులో మరో జడ్జి ఎదుట విచారణలో ఉన్నాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం తనకు ఎంఎల్ మంజూరు చేయడం లేదని, గతేడాది నవంబర్ లో జారీ చేసిన నోటిఫికేషన్ అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీ చేయాలని చంద్రవ్వ తన పిటిషన్ లో పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లోని ఉద్యోగులకు ఈ విధానం గురించి తెలియదని, దీంతో మహిళలను నియమించుకునే సంస్థలు ఉద్యోగులకు ఈవిధానంపై అవగాహన కల్పించాలని లేదా ఎంఎల్ అమలులో ఉన్న విషయాన్ని తెలియజేయాలని కోరారు. దీంతో మహిళలు ప్రయోజనాన్ని పొందగలరని పిటిషన్ లో ఉద్ఘాటించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# విశ్వాసం కోల్పోతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ
# ప్రపంచ దేశాలకు హెచ్చరిక!

ఇటీవలి కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు గమనిస్తే, ఒక ముఖ్యమైన సంకేతం స్పష్టంగా కనిపిస్తోంది. దేశాలు తమ సంపదపై మళ్లీ ప్రత్యక్ష నియంత్రణ సాధించాలనే తపన. ఫ్రాన్స్ తన బంగారం నిల్వలను అమెరికా నుండి వెనక్కి తీసుకువచ్చిందనే వార్త (అది పూర్తిగా నిజమో, అతిశయోక్తో వేరే విషయం) ఈ విస్తృత ధోరణికి ఒక ప్రతీకగా నిలుస్తోంది. ఈ పరిణామాన్ని కేవలం ఒక ఆర్థిక లావాదేవీగా కాకుండా, అంతర్జాతీయ విశ్వాస సంక్షోభం కోణంలో చూడాల్సిన అవసరం ఉంది.



ద్వితీయ ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పడిన బ్రేట్టన్ ఊడ్స్ ఒప్పందం ( Bretton Woods Agreement ) ద్వారా అమెరికా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్రబిందువుగా మారింది. డాలర్ ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా స్థిరపడింది. ప్రపంచ దేశాలు తమ బంగారం నిల్వలను అమెరికాలో, ముఖ్యంగా "ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్" లో భద్రపరిచాయి. ఇది కేవలం భద్రత కోసం మాత్రమే కాదు; అమెరికా పై ఉన్న రాజకీయ, ఆర్థిక నమ్మకం వల్ల కూడా జరిగింది.కానీ గత రెండు దశాబ్దాలలో ఆ నమ్మకం క్రమంగా దెబ్బతింటోంది. ముఖ్యంగా 2008లో జరిగిన గ్లోబల్ ఫైనాన్షియల్ క్రైసిస్ అమెరికా ఆర్థిక వ్యవస్థలోని బలహీనతలను ప్రపంచానికి బహిర్గతం చేసింది. భారీ బ్యాంకులు కుప్పకూలడం, ప్రభుత్వ రక్షణ ప్యాకేజీలు, నిరుద్యోగం పెరగడం , ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా విశ్వాసాన్ని కదిలించాయి. ఈ సంక్షోభం తర్వాత ప్రపంచ దేశాలు "అమెరికా ఎప్పటికీ స్థిరంగా ఉంటుంది" అనే భావనను పునఃపరిశీలించడం ప్రారంభించాయి.

ఇక ఇటీవల కాలంలో అమెరికా ఆర్థిక విధానాలు కూడా ప్రశ్నార్థకంగా మారాయి. భారీ రుణభారం, పెరుగుతున్న బడ్జెట్ లోటు, డాలర్‌పై అధిక ముద్రణ (మనీ ప్రింటింగ్) వంటి అంశాలు దీర్ఘకాలిక స్థిరత్వంపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఉదాహరణకు, అమెరికా ప్రభుత్వ ఋణం ట్రిలియన్ల డాలర్లకు చేరుకోవడం, దానికి వడ్డీ చెల్లింపులు కూడా భారీగా పెరగడం, ఇవి భవిష్యత్తులో డాలర్ విలువను దెబ్బతీసే ప్రమాదాన్ని కలిగిస్తున్నాయి.అంతేకాకుండా, అమెరికా తన ఆర్థిక శక్తిని రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం కూడా ఒక ప్రధాన కారణం. రష్యా, ఇరాన్ వంటి దేశాలపై ఆంక్షలు విధించడం, వారి విదేశీ నిల్వలను ఫ్రీజ్ చేయడం వంటి చర్యలు ఇతర దేశాల్లో భయాన్ని కలిగించాయి. "ఈరోజు వారిపై, రేపు మనపై?" అనే ప్రశ్న చాలా దేశాల ఆలోచనల్లో చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలోనే బంగారం వంటి భౌతిక ఆస్తులను తమ దేశంలోనే ఉంచుకోవాలనే అభిలాష పెరిగింది.

ఈ ప్రక్రియను "గోల్డ్ రిపాట్రియేషన్" (గోల్డ్ రిపాట్రియేషన్) అని పిలుస్తారు.జర్మనీ, నెదర్లాండ్స్ , హంగేరి వంటి దేశాలు ఇప్పటికే తమ బంగారం నిల్వలను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చాయి లేదా తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇది అమెరికా పై నమ్మకం పూర్తిగా పోయిందని చెప్పడం కంటే, "స్వీయ నియంత్రణ" వైపు ప్రపంచం అడుగులు వేస్తోందని చెప్పడం సరైనది.

ఇప్పుడు ప్రశ్న---అమెరికా ఎకానమీకి నిజంగా ఏమైంది? అది కుప్ప కూలిపోతుందా?

సరళంగా చెప్పాలంటే, అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్ప కూలిపోతున్నది కాదు. కానీ అది ఒక మార్పు దశలో ఉంది. ఒకప్పుడు ప్రపంచానికి ఏకైక ఆర్థిక కేంద్రంగా ఉన్న అమెరికా, ఇప్పుడు బహుళ కేంద్రాల ప్రపంచంలో ఒక ప్రధాన కేంద్రంగా మారుతోంది. చైనా వంటి దేశాలు ఆర్థికంగా ఎదగడం, బ్రిక్స్ వంటి వేదికలు ప్రత్యామ్నాయ వ్యవస్థలను ప్రతిపాదించడం...మొదలైన అన్నీ కలిసి అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్నాయి.

కానీ, అమెరికా డాలర్ ఇంకా ప్రపంచంలో ప్రధాన రిజర్వ్ కరెన్సీగానే ఉంది. దాని అధికారిక బెదిరింపులు అంతర్జాతీయ వాణిజ్యంలో, ముఖ్యంగా చమురు లావాదేవీలలో, డాలర్ ప్రాముఖ్యత కొనసాగుతోంది. కానీ అదే సమయంలో, కొన్ని దేశాలు తమ మధ్య వాణిజ్యాన్ని స్థానిక కరెన్సీల్లో నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇది డాలర్ ఆధిపత్యాన్ని క్రమంగా తగ్గించే ప్రక్రియ.

ఫ్రాన్స్ బంగారం వెనక్కి తీసుకువచ్చిందనే వాదన పూర్తిగా నిజం అవునో, కాదో ఇంకా పూర్తిగా తెలియక పోయినా, అంతర్గత గుసగుసల (అండర్లయింగ్ మెసేజ్) సమాచారం మాత్రం స్పష్టంగా ఉంది. ప్రపంచ దేశాల్లో ఆందోళన మొదలైంది. ఈ దేశాలు ఇకపైనా ఒకే దేశంపై పూర్తిగా ఆధారపడదలచుకోవడం లేదు. ఆర్థిక భద్రతను విభజించుకోవడం, రిస్క్‌ను తగ్గించుకోవడం ప్రధాన లక్ష్యంగా మారింది.ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. బంగారం నిల్వలు కేవలం ఆర్థిక భద్రతకు సూచిక మాత్రమే. అసలు శక్తి ఆర్థిక ఉత్పత్తి, సాంకేతిక ఆవిష్కరణలు, సైనిక శక్తి, రాజకీయ స్థిరత్వం వంటి అంశాల్లో కూడా ఉంటుంది. ఈ పరంగా చూస్తే, అమెరికా ఇప్పటికీ ప్రపంచంలో అగ్రస్థానంలోనే ఉంది. ఆపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి కంపెనీలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.కానీ అదే సమయంలో, అసమానతలు పెరగడం, మధ్య తరగతి క్షీణించడం, రాజకీయ విభజనలు పెరగడం వంటి అంతర్గత సమస్యలు అమెరికా ఆర్థిక వ్యవస్థను లోపల నుంచి బలహీనపరుస్తున్నాయి.చివరిగా చెప్పాలంటే, బంగారం రిపాట్రియేషన్ అనే ఈ పరిణామం ఒక హెచ్చరిక. అమెరికా ఆర్థిక పతనం ప్రారంభమైందని కాదు, కానీ ప్రపంచం మారుతోందని సూచిస్తుంది. అమెరికా ఆర్థిక విధానాలపై విశ్వాసం క్రమంగా క్షీణిస్తుంది. భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థ బహుళ ధ్రువాల (మల్టీపోలర్) రూపంలో ఉండబోతోంది.

ఇప్పటికే ఒక ప్రశ్న తలెత్తుతుంది.అది చివరకు మన ముందే నిలుస్తుంది. ఒకే దేశం ఆర్థిక శక్తిపై ఆధారపడే ప్రపంచం సురక్షితమా? లేక విభజిత, సమతుల్య వ్యవస్థ మరింత స్థిరమా? ఈ సమాధానం రాబోయే దశాబ్దాల ఆర్థిక రాజకీయాలను నిర్ణయిస్తుంది.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

# ఎండ తీవ్రతకు ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు..

**- భయాందోళనలో మిట్టకోడూర్ గ్రామస్థులు**






**జర్నలిస్ట్ డైరీ పరిగి, ఏప్రిల్ 15**
వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్టకోడూర్ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం భారీ విద్యుత్ ప్రమాదం తప్పింది. మితిమీరిన ఎండలు, దానికి తోడు వోల్టేజ్ హెచ్చుతగ్గుల కారణంగా గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా అగ్నిప్రమాదానికి గురైంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొద్దిరోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగింది. దీనివల్ల వోల్టేజ్ సమస్యలు తలెత్తి ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు వేడెక్కి మంటలు అంటుకున్నాయి. చూస్తుండగానే మంటలు పెద్దవిగా ఎగసిపడటంతో చుట్టుపక్కల ఉన్న వారు భయాందోళనతో పరుగులు తీశారు. వైర్లు కాలిపోయి కింద పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.అనీ తెలిపారు

**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం:**
వేసవిలో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో విద్యుత్ శాఖ అధికారులు విఫలమయ్యారని గ్రామస్థులు మండిపడుతున్నారు. పాతబడిన వైర్లు మార్చకపోవడం, లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలిపోయిన వైర్లను, ట్రాన్స్‌ఫార్మర్‌ను పునరుద్ధరించి గ్రామానికి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని మిట్టకోడూర్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మిట్టకోడూర్ పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన




**జర్నలిస్ట్ డైరీ పరిగి , ఏప్రిల్ 15:**
తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మిట్టకోడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన మరియు చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా, వారు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు.
వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, త్రిబుల్ రైడింగ్ చేయకపోవడం, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వాడకూడదని మరియు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని విద్యార్థులు తమ రచనల ద్వారా సందేశాన్ని ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను ఎలా నివారించవచ్చో విద్యార్థులు చక్కగా వివరించారు.అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శరత్ బాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, లక్మాపూర్ శ్రీనివాస్, షేక్ సాదిక్, మధుసూదన్ రావు, కరుణాకర్ మరియు కవిత, పాల్గొన్నారు.

# టీజీఆర్జేసీ సెట్ దరఖాస్తుకు నేడే ఆఖరు..

**హైదరాబాద్, ఏప్రిల్ 15 :**
తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ, కేజీబీవీల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే టీజీఆర్జేసీ సెట్ దరఖాస్తుల గడువు బుధవారంతో ముగియనున్నదని సంస్థ కార్యదర్శి రమణకుమార్ ప్రకటనలో తెలిపారు.
ఇప్పటి వరకు 60వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, ఆసక్తి గల వారు బుధవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.




**బడుల్లో భద్రతకు చర్యలు తీసుకోండి: విద్యాశాఖ**
హైదరాబాద్ : వేసవి సెలవుల్లో బడుల్లో భద్రతకు తగు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. ఆస్తులు, సామగ్రిని సురక్షితంగా ఉంచేందుకు కీలక ఆదేశాలిచ్చింది. బడుల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, మ్యూజికల్, స్పోర్ట్స్, ఇన్‌స్ట్రుమెంట్లు, ఫర్నీచర్, మధ్యాహ్న భోజన వస్తు సామగ్రిలున్నాయి. వీటి రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కీలక సూచనలు చేసింది. ఎంఈవో, డీఈవోల నంబర్లు ప్రదర్శించాలని, స్థానిక, పెట్రోలింగ్ పోలీసుల సహకారం, స్థానిక యువత, ఎన్జీవోల భాగస్వామ్యంతో పర్యవేక్షణ పెంచాలని సూచించింది.

**టెట్ అర్హత మార్కులు తగ్గించాలి: పీటీఏ టీజీ**
హైదరాబాద్, ఏప్రిల్ 15 : టెట్ అర్హత మార్కులు తగ్గించాలన్న విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం తమకు తీవ్ర నిరాశ కలిగించిందని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (పీటీఏ టీజీ) అభిప్రాయపడింది. ఇన్ సర్వీస్ టీచర్లకు మార్కులు తగ్గించకపోవడం బాధాకరమని సంఘం అధ్యక్షుడు కే మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే శారద, అదనపు సెక్రటరీ జనరల్ మేడే దేవదాస్ ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ టీచర్ల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని, ఏడాదికి ఒక మార్కు చొప్పున వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# మరణించిన వ్యక్తి ఆధార్ డీయాక్టివేట్ ఇలా..



అధికారిక UIDAIలో MyAadhaar పోర్టల్‌కు వెళ్లండి
మీ స్వంత ఆధార్ నెంబర్ లేదా కుటుంబ సభ్యులలో ఎవరిదో ఒక ఆధార్ నెంబర్ ఎంటర్ చేసి,ఓటీపీ ఉపయోగించి లాగిన్ అవ్వాలి.
లాగిన్ అయిన తరువాత Report Death of a Family Member అనే ఆప్షన్ ఎంచుకుని.. మరణించిన వ్యక్తి ఆధార్ వివరాలు నమోదు చేయాలి.
తరువాత డెత్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఎంటర్ చేయాలి.
మున్సిపాలిటీ లేదా సంబంధిత అధికారులు జారీ చేసిన మరణ ధృవీకరణ పత్రం అప్‌లోడ్ చేయాలి.ఇవన్నీ పూర్తయిన తరువాత.. వివరాలను వెరిఫై చేసిన తర్వాత UIDAI మరణించిన వ్యక్తి ఆధార్‌ను శాశ్వతంగా డీయాక్టివేట్ చేస్తుంది.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించి.. సురక్షితంగా ఇంటికి చేరండి

**- సర్పంచ్ పి . మాణిక్యం**

**జర్నలిస్ట్ డైరీ పరిగి, ఏప్రిల్ 15:**
క్షేమంగా ఇంటికి చేరాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని మిట్ట కోడూర్ గ్రామ సర్పంచ్ పి. మాణిక్యం అన్నారు. బుధవారం పరిగి మండలంలోని మిట్ట కోడూరు ప్రాథమిక పాఠశాలలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 'చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి ఉస్మాన్ అలీ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సుకు సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, అప్రమత్తతతోనే





ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఆయన సూచించిన ముఖ్య ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.ఫోర్ వీలర్స్ నడిపే వారు సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రమాద తీవ్రత తగ్గుతుంది.డ్రైవింగ్ చేసే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడటం ప్రాణాంతకమని హెచ్చరించారు.రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి అనిత రాణి, ఉప సర్పంచ్ మల్లేశం, గ్రామ కార్యదర్శి బాలకిషన్, వార్డు సభ్యులు జనార్దన్, మల్లేశం, వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు జహంగీర్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింలు, ఉపాధ్యాయులు ఏ. కృష్ణయ్య, ఎన్. నర్సింలు, రాజు, అంగన్వాడీ టీచర్లు పద్మమ్మ, చంద్రకళ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

## కుమార్తెను చంపి.. తాను ఆత్మహత్య చేసుకున్న తల్లి



బెంగళూరులోని ఇమ్మడిహళ్లి మెయిన్ రోడ్డులో ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్ మెంట్స్ లో చోటు చేసుకున్న సంచలన ఘటనభర్త చంద్రశేఖర్ డ్యూటీకి వెళ్లాక తన కుమార్తె తారుణ్య(13)ను హతమార్చి,తాను సూసైడ్ చేసుకున్న సువర్ణ (45) ఊపిరి ఆడకుండా తారుణ్యని చంపి.. సువర్ణ ఉరి వేసుకుని సూసైడ్ చేసుకున్నట్టు విచారణలో వెల్లడి కుమార్తె ఫ్యూచర్ గురించి సువర్ణ ఎప్పుడూ ఆందోళన చెందేదని.. ఆ భయంతోనే ఈ పని చేసి ఉండొచ్చని అనుమానం ఈ ఘటనపై రెండు కేసులు నమోదు.. చంద్రశేఖర్ తన భార్యపై ఫిర్యాదు, లోతుగా విచారణ చేయాలని కోరుతూ సువర్ణ తమ్ముడు ఫిర్యాదు

## ఉగ్ర కుట్ర భగ్నం.. 11 మంది అరెస్ట్



విజయవాడ కేంద్రంగా సాగుతున్న ఉగ్ర నెట్వర్క్ ను పోలీసులు ఛేదించి 11 మందిని అరెస్ట్ చేశారు.ఆఫ్ఘనిస్థాన్కు చెందిన అల్ హకీం షుకూర్ మార్గదర్శకత్వంలో యువతను ఉగ్రవాదం వైపు మళ్ళ పెడుతున్నట్లు గుర్తించారు.వీరికి ఆల్ ఖైదా,ఐసిస్ వంటి నిషేధిత సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు.ISIS జెండా ఎగురవేయడమే లక్ష్యమని నిందితులు వెల్లడించినట్లు తెలుస్తోంద్ని

## ఆమనగల్లు డిగ్రీ కళాశాలలో దోస్త్ ప్రక్రియ ప్రారంభం



**ఆమనగల్లు, ఏప్రిల్ 15**
ఆమనగల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో దోస్త్ ప్రక్రియలో భాగంగాకళాశాలలో అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ శర్వాణి అన్నారు. డిగ్రీ కళాశాలలో 2026..2027 విద్యా సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్లకు మొదటి దశలో ఏప్రిల్ 15 నుండి మే 7 వరకు ఆన్లైన్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శర్వాణి తెలిపారు. వెబ్ ఆప్షన్లను ఏప్రిల్ 30 నుండి మే 8 వరకు, సీట్ల కేటాయింపు మే 14న, సెల్ఫ్ రిపోర్టింగ్ మే 15 నుంచి 23 వరకు ఉంటుందని తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శర్వాణి అన్నారు.

# నాల విస్తరణ పనులను పరిశీలించిన గాంధీ




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఏప్రియల్ , 15 (జర్నలిస్ట్ డైరీ) :**
అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణి నగర్ నాల విస్తరణ పనులలో భాగంగా పరికి చెరువు అలుగు నుండి ప్రేమ్ సరోవహర్ అపార్టుమెంట్స్ వరకు రూ. 8 కోట్ల 76 లక్షల రూపాయల అంచనావ్యయం తో చేపట్టబోయే నాల విస్తరణ పనులను తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, SNDP ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించిన PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ గారు.ఈ సందర్భంగా PAC చైర్మన్ గాంధీ మాట్లాడుతూ... నాలల విస్తరణ పనులు చేపట్టడం తో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్య కు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని, ధరణి నగర్ కాలనీ లో నాల విస్తరణ పనులలో భాగంగా అసంపూర్తిగా మిగిలిపోయిన నాల విస్తరణ పనులను రూ. 8 కోట్ల 76 లక్షల రూపాయల అంచనావ్యయం తో నిర్మాణము పనులు చేపట్టడం జరుగుతుంది అని, నాల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని , త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని .ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరనుంది అని, నాలా విస్తరణ పనులకు అందరూ సహకరించాలని , ఒక్కప్పుడు వరదలు వస్తే కంటి మీద కునుకు లేకుండా ప్రజలు తీవ్ర ఆందోళన తో ఇబ్బందులకు గురయ్యేవారు అని, కానీ నేడు సమస్య లేకుండా మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగినది అని,నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించింది అని ప్రజా అవసరాల దృష్ట్యా ప్రథమ ప్రధాన్యత లో విస్తరణ పనులు చేపట్టాలని రాబోయే వర్షాకాలం లోపు పనులు పూర్తి చేయాలని ,నాలల విస్తరణ పనులలో వేగం పెంచాలని , యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలియచేశారు. ధరణి నగర్ నాల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాల విస్తరణ పనులు పై అధికారులకు పలు సూచనలు , సలహాలు ఇవ్వడం జరిగినది, ఏ చిన్న సమస్య ఎదురైన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని ఆదేశాలు ఇవ్వడం జరిగినది.నాలల విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, నాలల విస్తరణ పనులు సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని, ప్రధాన రహదారుల పై పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని , నాలల నిర్మాణం సమయంలో నీటి ప్రవాహం సాఫీగా సాగేలా లెవల్స్ ను నిర్ధారించుకొని పనులు చేపట్టాలని, వర్షాకాలంలోపు పనులు పూర్తయ్యేలా చూడలని , వరద ముంపు మళ్ళీ పునరావృతం కాకుండా నాలల విస్తరణ నిర్మాణం పనులు చేపట్టాలని తెలియచేసారు. నాలల విస్తరణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని , పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని, నాల విస్తరణ పనులు పై అధికారులకు పలు సలహాలు , సూచనలు ఇవ్వడం జరిగినది .ప్రతి వర్షానికి వరద నీరు కాలనీలు ముంచెత్తడం జరుగుతుంది అని, సమస్య శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపట్టడం జరుగుతుంది అని, భవిష్యత్తు లో వరద సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకొని నాల విస్తరణ పనులు చేపడుతున్నాం అని, నాల విస్తరణ మరియు , RCC బాక్స్ డ్రైన్ నిర్మాణము వలన ప్రజలకు ఎంతగానో ఉపశమనం కలుగుతుంది అని, ప్రజలకు సాంత్వన చేకూరుతుంది అని, పనులు పూర్తిచేయాలని అధికారులకు తెలియచేసారు.పనుల విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడలని, వర్షకాలంను దృష్టిలో పెట్టుకొని ప్రజా అవసరాల దృష్ట్యా అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ నిర్మాణ పనులను చేపట్టడం జరిగినది అని, యుద్ధప్రాతిపదికన పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని,నాల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుడదని, పనుల లో వేగం పెంచాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడలని త్వరితగతిన నాల విస్తరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేసారు. నాలల విస్తరణ పై ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తప్పకుండా పరిష్కరిస్తామని, తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని ఏ చిన్న సమస్య ఎదురైన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని అధికారులకు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ూజు అరుణ్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాశినాథ్ యాదవ్, లక్ష్మణ్ రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ముజాహిద్‌పూర్ సంతలో రైతుల నిలువు దోపిడీ


### - అధికారులకు (HRPS) ఫిర్యాదు!

**జర్నలిస్ట్ డైరీ కుల్కచర్ల ఏప్రిల్ 15**
వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ముజాహిద్ పూర్ గ్రామంలో ప్రతి మంగళవారం నిర్వహించే తాయి బజార్ (సంత)లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ (HRPS) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ షా మహమ్మద్ హుస్సైని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మండల పరిషత్ అభివృద్ధి అధికారి (వీఁణూ)కి మరియు గ్రామ పంచాయతీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు
గ్రామ పంచాయతీ నిర్వహించిన వేలంపాటలో సంతను దక్కించుకున్న వ్యాపారి, రైతుల వద్ద నుండి ఒక గంపకు లేదా మూటకు 30 నుండి 50 వరకు వసూలు చేస్తున్నారని హుస్సైని ఆరోపించారు. రవాణా ఖర్చులు పోను, ఈ అధిక రుసుముల వల్ల రైతులకు చివరకు చిల్లిగవ్వ కూడా మిగలడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేలంలో పెట్టిన పెట్టుబడిని తిరిగి రాబట్టుకోవడానికే రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.ప్రస్తుతం ఈ సంతను ప్రధాన R&B రహదారిపై నిర్వహించడం వల్ల ఆర్టీసీ బస్సులు, పాఠశాల వాహనాలు మరియు ఇతర ప్రయాణికులు





వెళ్లే దారి కావడంతో రైతులకు ప్రమాదం జరిగే అవకాశాలు చాలా ఉన్నాయని రైతులకు సరైన సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని



To
The Secretary
Gram Panchayat Mujahidpur Village
Kulkacharla Mandal
Vikarabad District, Telangana
Date: 15/04/2026
Subject: Petition regarding collection of basket charges from farmers, lack of facilities and safety issues at Thai Bazaar weekly market in Mujahidpur Village.
Respected Sir/Madam,
I would like to bring to your kind notice that the Thai Bazaar weekly market conducted every Tuesday in Mujahidpur Village, Kulkacharla Mandal, Vikarabad District is reportedly auctioned by the Gram Panchayat to a private trader for a period of one year. After obtaining the market through auction, the trader is collecting ₹30 to ₹50-100 per basket from the farmers who bring vegetables to sell in the market. This practice is creating a heavy financial burden on the farmers.
It is observed that some traders compete in the auction by quoting higher amounts to secure the market. Later, they try to recover that money by imposing heavy charges on farmers. As a result, farmers coming from nearby villages with their vegetables are facing serious financial loss.
For example, if a farmer brings 3 kg of spinach to the market and sells it at ₹40 per kg, he earns ₹120 in total. Out of this amount, he has to pay ₹30 as the basket charges to the trader. In addition, he spends about ₹60 as auto transportation charges to bring the vegetables to the market. In total, ₹90 is spent, leaving the farmer with only ₹30 as income. This clearly shows the difficult situation of farmers despite their hard work.
Further, farmers face great difficulty in transporting their produce to the market due to lack of proper transportation facilities. After struggling to reach the market, they are forced to pay these charges.
Another serious issue is that the weekly market is being conducted on the main road in Mujahidpur Village, which is causing traffic problems for buses and other vehicles entering the village. On market day, farmers and vendors are forced to sit on the roadside to sell vegetables. If any unfortunate accident occurs due to vehicles passing through the crowded road, innocent farmers and villagers may suffer serious injuries or loss of life.
Moreover, there are no basic facilities for farmers in the market area. There is no proper sitting space, no sheds to protect vegetables from sun and rain, and no drinking water, sanitation, or lighting facilities.

In addition, some villagers leave their goats freely in the village. These goats enter the market area and eat the vegetables kept for sale by farmers, causing further losses to them.
Therefore, I humbly request you to kindly look into the above issues and take immediate necessary action:
1)Review or cancel the basket charges collected from farmers.
2)Ensure that the weekly market is conducted at a proper place instead of the main road.
3)Provide basic facilities such as sheds, seating space, drinking water and sanitation for farmers.
4)Take necessary steps to prevent goats from entering the market area.
I request you to kindly take immediate action to protect the interests and safety of farmers in Mujahidpur Village, Kulkacharla Mandal, Vikarabad District.
Thanking you.
Copy to
1) Collector Vikarabad
2)DPO Vikarabad
3)MPDO Kulkacharla
4) MPO Kulkacharla
Yours faithfully,
Syed Shah Mohammed Hussaini
S/o Syed Amjad Hussaini
#Seva Rathna Awardee
#Working President
#Human Rights Public Protection Service (HRPS)
Vikarabad District
H. Number:2-111
Mujahid pur Villege Kulkacharla Mandal Vikarabad District
Telangana Pincode:501502Mobile: 9849462786

తెలిపారు. రోడ్డుపైనే రైతులు కూర్చుని వ్యాపారం చేయడం వల్ల ట్రాఫిక్ జామ్ అవ్వడమే కాకుండా, ఏదైనా వాహనం అదుపు తప్పితే రైతుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గ్రామంలో తిరిగే మేకలు రైతుల కూరగాయలను తినేస్తూ నష్టం కలిగిస్తున్నా పట్టించుకునే నాథుడే లేదని మండిపడ్డారు. "వెంటనే రైతులపై విధిస్తున్న గంప రుసుమును రద్దు చేయాలి. సంతను రోడ్డు మీద నుండి సురక్షితమైన ప్రదేశానికి మార్చాలి. రైతులకు అవసరమైన షెడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలి. అధికారులు స్పందించకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం."అనీ మండిపడ్డారు

# ఘనంగా "చెలియా చూడవా" సినిమా పోస్టర్ విడుదల!

LV ప్రొడక్షన్ బ్యానర్‌పై ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సరికొత్త ఇండిపెండెంట్ తెలుగు చిత్రం "చెలియా చూడవా".
తాజాగా చిత్ర బృందం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఘనంగా విడుదల చేసింది.
విభిన్నమైన కథాంశంతో, నూతన తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమా పోస్టర్ కు మంచి స్పందన లభిస్తోంది.
హీరో ఎల్ వి వెంకి మాట్లాడుతూ..
LV ప్రొడక్షన్ బ్యానర్‌లో 'చెలియా చూడవా' లాంటి ఒక స్వచ్ఛమైన కథతో మీ ముందుకు రావడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాత: ఎల్ వి లాస్య ప్రియ ం దర్శకుడు రాజేష్ బందెల ఈ చిత్రాన్ని చాలా అద్భుతంగా, అందరికీ కనెక్ట్ అయ్యేలా తెరకెక్కించారు. నా కో-స్టార్ ఆద్య చౌదరి, అలాగే ఇతర ముఖ్య పాత్రల్లో నటించిన నిఖిత రెడ్డి, కృష్ణ గారితో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతి. బిజిఎం సందీప్ కుమార్ ఎమ్, సాంగ్స్ నాని జాన్, సిద్ధం నరేష్ కెమెరా పనితనం ఈ సినిమాకు ప్రాణం పోశాయి. ఒక మంచి ప్రయత్నంతో వస్తున్న మా ఈ ఇండిపెండెంట్ సినిమాకు మీ అందరి ఆశీస్సులు, పూర్తి సపోర్ట్ ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను."
ఈ పోస్టర్ లాంచ్‌తో మొదలైన చిత్ర ప్రమోషన్స్ జర్నీ.. త్వరలోనే టీజర్, మరియు అందమైన పాటల ద్వారా మరింతగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.
నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలు:








నిర్మాత: ఎల్ వి లాస్య ప్రియ
హీరో: ఎల్ వి వెంకి
హీరోయిన్: ఆద్య చౌదరి
ప్రధాన పాత్రలు: నిఖిత రెడ్డి, కృష్ణ జూ
బ్యానర్: LV ప్రొడక్షన్
దర్శకత్వం: రాజేష్ బందెల
కథ: సబ్బి ప్రీతం
సినిమాటోగ్రఫీ: సిద్ధం నరేష్
బిజిఎం: సందీప్ కుమార్ ఎమ్
సాంగ్స్ : నాని జాన్
గానం (సింగర్): వీహ
ఎడిటింగ్: రాజేష్ ఉరుకొండ
పోస్టర్ డిజైన్: వాణి సాయి రామ్
లిరిక్స్ : సురేష్ పున్నమల్ల, రాజేష్ బందెల
డబ్బింగ్ : KR స్టూడియో
స్టూడియో: విరాట్ స్టూడియో
ఈ చిత్రానికి ప్రేక్షక దేవుళ్ళ ఆదరాభిమానాలు, మీడియా మిత్రుల సహకారం అందించాలని చిత్ర బృందం కోరుకుంటోంది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# వేసవిలో పచ్చి మామిడి తింటే.. ఆరోగ్య ప్రయోజనాలెన్నో!



ఇంటర్నెట్‌డెస్క్

వేసవిలో పచ్చి మామిడి విరివిగా దొరుకుతుంది. వీటితో సంవత్సరానికి సరిపడా ఆవకాయని పెట్టుకోవచ్చు. లేదా జ్యూస్‌ల్లో ఉపయోగించడమో, ఇతర స్పెషల్ డిషెస్ తయారుచేయడమో చేస్తుంటారు. అలాగే పచ్చిమామిడి ముక్కలపై ఉప్పు, కారం చల్లుకుని యమ్మీగానూ తింటారు. ప్రత్యేకించి వేసవిలో లభించే ఈ పచ్చి మామిడిని తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మరి ఈ మామిడి వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందామా..!

పచ్చి మామిడిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది హిమోఫిలియా, రక్తహీనత వంటి ప్రమాదాలను తగ్గించడంలో కీలకంగా వ్యవహరిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

రక్తం గడ్డ కట్టడాన్ని నిరోధిస్తుంది.

పచ్చి మామిడిలో కెరోటినాయిడ్స్ అధికంగా ఉండటం వల్ల కంటిచూపు మెరుగుపడేలా సహాయపడుతుంది.

వేసవిలో పచ్చి మామిడిని తినడం వల్ల డీహైడ్రేషన్‌కు గురికాకుడా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు.

పచ్చిమామిడి అజీర్తి సమస్యల్ని తగ్గిస్తుంది.

పచ్చిమామిడిలో విటమిన్ ఇ, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఎంతగానో దోహదపడతాయి.

# గడువు ముగిసిన గుడ్లను ఇలా గుర్తించండి

ఇంటర్నెట్ డెస్క్

గుడ్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి, కానీ గడువు ముగిసిన లేదా పాడైపోయిన గుడ్లను తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ జరిగే ప్రమాదం ఉంది. అంతేకాకుండా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి గుడ్లు వాడే ముందు వాటి నాణ్యతను పరీక్షించడం చాలా అవసరం. పాడైపోయిన గుడ్లలో సాల్మొనెల్లా వంటి హానికరమైన బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇవి శరీరంలోకి వెళ్లినప్పుడు కడుపునొప్పి, విరేచనాలు, వాంతులు, డీహైడ్రేషన్ వంటి సమస్యలు కలుగుతాయి. చిన్నపిల్లలు, వృద్ధులకు ఇది మరింత ప్రమాదకరం.

**వికారం, వాంతులు:**
పాడైన గుడ్లు తింటే శరీరంలో విషపదార్థాలు పెరిగి వెంటనే వికారం, వాంతులు, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**జ్వరం, నీరసం:**
బాక్టీరియా ఇన్ఫెక్షన్ పెరిగితే శరీరం దానితో పోరాడేందుకు ఉష్ణోగ్రత పెంచుతుంది. దీంతో జ్వరం వస్తుంది. అలాగే అలసట, నీరసంగా అనిపిస్తుంది.

**రోగనిరోధక శక్తి తగ్గడం:**
గడువు ముగిసిన గుడ్లు తింటే రోగనిరోధక శక్తి బలహీనమవుతుంది. దాంతో చిన్న చిన్న వ్యాధులు కూడా త్వరగా అంటుకుంటాయి.

పాడైన గుడ్డును ఎలా గుర్తించాలి?

గుడ్డును నీళ్లలో వేసి చూడండి. తాజా గుడ్డు పూర్తిగా మునిగిపోతుంది. పాడైపోయిన గుడ్డు నీళ్లపై తేలుతుంది. అటువంటి గుడ్డును ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు. గుడ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. కానీ వాటి నాణ్యతపై జాగ్రత్త అవసరం. గడువు ముగిసిన గుడ్లు తినకుండా, ముందుగా చెక్ చేసుకోవడం ద్వారా ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చు.



# పుచ్చకాయ కొనేటప్పుడు ఈ పొరపాటు అస్సలు చేయకండి!



ఇంటర్నెడ్ డెస్క్

వేసవి కాలం వచ్చిందంటే అందరికీ గుర్తుకు వచ్చే మొదటి పండు పుచ్చకాయ. పుచ్చకాయలో ఎన్నో రకాల విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయలను తింటే ఎండ వేడిమికి డీహైడ్రేషన్ కాకుండా కాపాడుతుంది. అయితే, మార్కెట్‌కు వెళ్లినప్పుడు వందల కాయల్లో ఏది తీయగా ఉంటుందో, ఏది పాడై పోయిందని కనిపెట్టడం చాలా కష్టం. పుచ్చకాయపైన చూడటానికి ఎర్రగా కనిపించినా, తీరా కోసిన తర్వాత తెల్లగా ఉంటే డబ్బులు వృథా అవుతుంది. అందుకే, పుచ్చకాయ కొనేటప్పుడు ఈ క్రింది విషయాలను తప్పక గమనించండి.

1. మెరుపును చూసి మోసపోకండి. చాలామంది పండు మెరుస్తూ ఉంటే అతి తాజాగా ఉందని అనుకుంటారు. కానీ, పుచ్చకాయ విషయంలో అది తప్పు. బాగా పండిన పుచ్చకాయ మెరుపు లేకుండా ఉంటుంది. కార మెరుస్తోందని అంటే అది ఇంకా పచ్చిగా ఉందని అర్థం.
2. పుచ్చకాయ నేలపై పడి ఉన్నప్పుడు ఒక వైపు సూర్యరశ్మి తగలదు. ఆ భాగాన్ని 'ఫీల్డ్ స్పాట్' అంటారు. ఆ మచ్చ నారింజ-పసుపు రంగులో ఉంటే అది తీయగా ఉందని అర్థం. ఒకవేళ అది తెల్లగా ఉంటే ఆ కాయ ఇంకా పండలేదని అర్థం.
3. పుచ్చకాయ తీసుకునేటప్పుడు ఆకారాన్ని గమనించాలి. పొడవుగా ఉన్నవి మగపండు(మ్ఖిశ్రీవ). వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది కానీ తీపి తక్కువ. గుండ్రంగా ఉన్నవి ఆడవి(ఖీవమ్ఖిశ్రీవ). ఇవి చాలా తీయగా ఉంటాయి, మీకు తీపి కావాలంటే గుండ్రటి కాయను తీసుకోండి.
4. ఒకే పరిమాణంలో ఉన్న రెండు కాయలను చేతిలోకి తీసుకున్నప్పుడు, ఏది ఎక్కువ బరువు ఉంటే దాన్ని తీసుకోండి. బరువు ఎక్కువగా ఉంటుందంటే అందులో గుజ్జు, రసం సమృద్ధిగా ఉన్నాయని అర్థం.
5. కాయపైన గోధుమ రంగులో నెట్ లాంటి గీతలు కనిపిస్తే.. ఆ పండును అస్సలు వదలకండి. ఆ గీతలు ఎక్కువగా ఉంటే, ఆ పండు అంత తీయగా ఉంటుందని అర్థం. పిందెగా ఉన్నప్పుడు తేనెటీగలు ఎక్కువగా వాలడం వల్ల ఆ గీతలు ఏర్పడతాయి.
6. పుచ్చకాయకు ఉన్న కాడ పచ్చగా ఉంటే అది చెట్టు నుంచి ముందే కోసేశారని అర్థం. అదే కాడ పూర్తిగా ఎండిపోయి ఉంటే, అది చెట్టు మీద సహజంగా పండిందని, తింటే చాలా రుచిగా ఉంటుందని అర్థం.

## బిజినెస్

# బంగారం కొనేవారికి షాక్..

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు..

**సెన్సెక్స్ 1,264 పాయింట్లు లాభం.. 10 లక్షల కోట్లు పెరిగిన సంపద**



భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలు చవిచూశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1,264 పాయింట్ల లాభంతో ముగిసింది. నిఫ్టీ కూడా 388 పాయింట్లు లాభపడింది. యుద్ధం ముగిసిందని, అలాగే, ఇరాన్‌తో మరోసారి చర్చలు జరుగుతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన మార్కెట్లకు సానుకూల వాతావరణం తీసుకొచ్చింది. దీంతో మార్కెట్లు లాభాల దిశగా పయనించాయి.దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల విలువ దాదాపు రూ.10 లక్షల కోట్ల మేర పెరిగింది. ఉదయం ట్రేడింగ్ లాభాలవద్ద 77,981 పాయింట్లతో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,270 గరిష్ట స్థాయికి చేరుకుంది. చివరకు 1,264 పాయింట్ల లాభంతో 78,111.24 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 388 పాయింట్ల లాభంతో 24,231.30 వద్ద ముగిసింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ సంస్థ 4.63 శాతం లాభంతో సెన్సెక్స్‌లో అత్యధికంగా లాభపడింది. ఆ తర్వాత ఎటర్నల్ లిమిటెడ్ సంస్థ 4.36 శాతం, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 4.11 శాతం, టెక్ మహీంద్రా 3.33 శాతం, టీసీఎస్ 3.31 శాతం లాభపడ్డాయి. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ సంస్థ 0.64 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ లిమిటెడ్ 0.20 శాతం నష్టపోయాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 93.37గా ఉంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా సానుకూల వాతావరణం ఏర్పడటంతో క్రూడాయిల్ ధరలు తగ్గాయి. బుధవారం బ్యారెల్ క్రూడాయిల్ ధర 95 డాలర్లుగా ఉంది.

## మళ్లీ పెరిగిన పసిడి ధరలు.. తులం ఎంతంటే..?



భారతీయులకు బంగారం అంటే కేవలం ఒక మెటల్ కాదు.. స్పెషల్ సెంటిమెంట్. పెళ్లి, పండగ వేడుక ఏదైన బంగారం కొనాల్సిందే. అంతేకాకుండా కష్టసమయాల్లో ఆదుకునే ఆర్థిక భరోసా కూడా. అయితే గత కొంత కాలంగా పెరుగుతున్న ధరలతో సామాన్యుడు బంగారం కొనలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. గతేడాది మొదట్లో రూ.లక్ష లోపు ఉన్న బంగారం ఇప్పుడు లక్షన్నర దాటింది. అంతర్జాతీయ పరిస్థితులే దీనికి కారణం అని చెప్పొచ్చు. ఇక బుధవారం కూడా బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో ఈరోజు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.10 పెరిగి రూ.1,53,940 కి చేరుకుంది. ఇక అదేవిధంగా సామాన్యులు ఆభరణాల తయారీ కోసం కొనుగోలు చేసే 22 క్యారెట్ల బంగారం ధర కూడా 10 గ్రాములపై రూ.10 పెరగడంతో ప్రస్తుతం రూ.1,41,110 కి చేరుకుంది.

**ఇతర నగరాల్లో**

ఇక విజయవాడ, వైజాగ్ నగరాల్లోనూ హైదరాబాద్‌లో ఉన్న ధరలే కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి రూ.1,54,090గా ఉంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,41,260 వద్ద కొనసాగుతుంది. ఇక చెన్నైలో ఇతర నగరాల కంటే బంగారం ధరలు స్వల్పంగా ఎక్కువగా ఉన్నాయి. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర దాదాపు రూ.1,55,140 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,42,210గా ఉంది.

**వెండి ధరలు ఇలా**

బంగారం బాటలోనే వెండి ధరలు కూడా స్వల్పంగా పెరిగాయి. కేజీ వెండి ధర రూ.100 పెరగడంతో హైదరాబాద్, విజయవాడ, వైజాగ్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,65,100 కి చేరింది. కిలోపై రూ.100 పెరగడం వల్ల తులం వెండి ధర రూ.2,651 గా ఉంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ గరిష్ట స్థాయిలో ఉండటంతో వినియోగదారులు అధిక ధరలు ఉన్నప్పటికీ కొనుగోళ్లు జరుపుతున్నారు.

## ఓలా నయా స్కూటర్.. ప్రారంభ ధర రూ 1,29,999

**సింగిల్ చార్జింగ్‌కు 320 కిలోమీటర్లు**



**న్యూఢిల్లీ,**
ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఓలా మరో మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. నూతన ఎస్1 ఎక్స్ం 5.2 కిలోవాట్ల బ్యాటరీతో తయారు చేసిన ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.1,29,999గా నిర్ణయించింది. ఈ ధర ఈ నెల 15 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నదని, ఆ తర్వాత ఈ స్కూటర్ ధరను సవరించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.4680 భారత్ సెల్ ప్రమాణాలకు అనుగుణంగా ఈ నయా స్కూటర్‌ను తీర్చిదిద్దినట్లు చెప్పారు. 11 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ స్కూటర్ సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. గంటకు 125 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్న ఈ స్కూటర్‌లో ఫ్రంట్ డిస్క్ బ్రేక్స్‌తో మరింత కంట్రోల్ చేయవచ్చునని తెలిపారు.

## స్పోర్ట్స్

# సన్ రైజర్స్ జట్టులోకి దిల్షాన్ మధుశంక




ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత విజయంతో దూసుకుపోతున్న సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాజస్థాన్ రాయల్స్‌పై స్టన్నింగ్ విజయం సాధించిన మరుసటి రోజే ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ ఈ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే అతను ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. ఈ క్రమంలో అతని స్థానాన్ని భర్తీ చేయడానికి శ్రీలంకకు చెందిన ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మధుశంకను ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఎంపిక చేసింది. ఈ మేరకు ఐపీఎల్ మేనేజ్మెంట్ అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. శ్రీలంక తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న మధుశంకకు స్వింగ్ బౌలింగ్‌లో మంచి పట్టు ఉంది. ఇప్పటివరకు అతను శ్రీలంక తరపున ఒక టెస్ట్, 28 వన్డేలు, 19 టీ20 మ్యాచ్‌లు ఆడి మొత్తం 70 వికెట్లు పడగొట్టాడు. గతంలో ముంబై ఇండియన్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నప్పటికీ, గాయం వల్ల ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం లభించలేదు. ఇప్పుడు రూ. 75 లక్షల ఒప్పందంతో సన్ రైజర్స్ గూటికి చేరుతున్నాడు. పవర్ ప్లే ఓవర్లలో బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టడం ఇతని ప్రత్యేకత. ఇతని రాకతో ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ విభాగం మరింత బలోపేతం కానుంది. ప్రస్తుతం సన్ రైజర్స్ బౌలింగ్ యూనిట్ చాలా పటిష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే యువ సంచలనాలు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ తమ అరంగేట్రం మ్యాచ్‌లోనే చెరో నాలుగు వికెట్లు తీసి అందరినీ ఆశ్చర్యపరిచారు. వీరికి తోడుగా హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్ వంటి అనుభవజ్ఞులు కూడా ఉన్నారు. జట్టు రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఏప్రిల్ 17న టీమ్‌తో చేరే అవకాశం ఉంది. అప్పటివరకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. కిషన్ సారథ్యంలో జట్టు ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించి, పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది.రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో హైదరాబాద్ అదిరిపోయే పర్ఫార్మెన్స్ ఇచ్చింది. 217 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడంలో ప్రఫుల్, సాకిబ్ తమ అద్భుత బౌలింగ్‌తో రాజస్థాన్‌ను 159 పరుగులకే కట్టడి చేశారు. ఈ 57 పరుగుల భారీ విజయంతో టీమ్ ఫుల్ జోష్‌లో ఉంది. ఇప్పుడు అదే ఉత్సాహంతో శనివారం తమ హోమ్ గ్రౌండ్ అయిన రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తో తలపడనుంది. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌లో మధుశంక అరంగేట్రం చేస్తాడేమో చూడాలి. ఉప్పల్ స్టేడియం వేదికగా జరగనున్న ఈ పోరు కోసం ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

## అజింక్యా రహానేకు భారీ జరిమానా..



ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఏదీ కలిసి రావడం లేదు. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో కేకేఆర్ గెలుపు బోణీ కొట్టలేదు. మంగళవారం చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 32 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ సీజన్‌లో కేకేఆర్‌కు ఇది నాలుగో ఓటమి కాగా.. మరో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. అయితే తాజాగా కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానేకు ఐపీఎల్ నిర్వాహకులు షాకిచ్చారు. రూ. 12 లక్షలు జరిమానాగా విధించారు. సీఎస్‌కేతో మ్యాచ్‌లో కేకేఆర్ జట్టు స్లో ఓవర్ రేటు నమోదు చేయడమే అందుకు కారణం. ఈ సీజన్‌లో కేకేఆర్ స్లో ఓవర్ రేటును నమోదు చేయడం ఇదే తొలిసారి కావడంతో కెప్టెన్ రహానే ఒక్కడికే జరిమానా విధించారు. రెండో సారి ఇదే తప్పిదానికి పాల్పడితే అప్పుడు కెప్టెన్‌కు రూ. 24 లక్షల జరిమానాతో పాటు ఇంపాక్ట్ ప్లేయర్ సహా తుది జట్టులోని ఆటగాళ్లకు మ్యాచ్ ఫీజుల్లో 25 శాతం లేదంటే 6 లక్షలు.. రెండింటిలో ఏదీ తక్కువ అయితే అది జరిమానాగా విధిస్తారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని కనీస ఓవర్-రేట్ ఉల్లంఘనలకు సంబంధించిన ఆర్టికల్ 2.22 ప్రకారం ఈ సీజన్‌లో కేకేఆర్ టీమ్ చేసిన మొదటి ఉల్లంఘన ఇది కావడంతో.. రహానెకు 12 లక్షల రూపాయల జరిమానా విధించారని ఐపీఎల్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై సంజూ శాంసన్ (48), డెవాల్డ్ బ్రెవిస్ (41), ఆయుష్ మాత్రే (38) రాణించడంతో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. కేకేఆర్ బౌలర్లలో కార్తిక్ త్యాగి 2, వైభవ్ అరోరా, అనుకుల్ రాయ్, సునీల్ నరైన్‌లు తలా ఓ వికెట్ తీశారు. అనంతరం 193 పరుగుల లక్ష్య ఛేదనలో కేకేఆర్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 160 పరుగులకే పరిమితమైంది. కేకేఆర్ బ్యాటర్లలో రమణ్‌దీప్ సింగ్ (35), రోవ్‌మన్ పావెల్ (31) రాణించారు. సీఎస్‌కే బౌలర్లలో నూర్ అహ్మద్ 3, అన్షుల్ కంబోజ్ 2 వికెట్లు, ఖలీల్ అహ్మద్, అకీల్ హోసేన్ లు చెరో వికెట్ పడగొట్టారు.

# రుతురాజ్ ఉరుకులాట తగ్గించాలి



**రవీచంద్రన్ అశ్విన్ కీలక సలహా**

ఐపీఎల్ 2026 సీజన్‌లో పేలవ బ్యాటింగ్‌తో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రవీచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. బ్యాటింగ్‌లో దూకుడు తగ్గించి, క్రీజులో సెట్ అయ్యేందుకు టైమ్ తీసుకోవాలన్నాడు. బంతిని గాల్లోకి లేపకుండా.. సంజూ శాంసన్, ఆయుష్ మాత్రే తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలని సూచించాడు. మరోవైపు వరుస పరాజయాలతో సతమతమవుతున్న కేకేఆర్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు కావాలని అభిప్రాయపడ్డాడు. మంగళవారం చెన్నై వేదికగా జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 32 పరుగుల భారీ తేడాతో కేకేఆర్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ గురించి జియో హాట్‌స్టార్‌లో మాట్లాడిన అశ్విన్.. సీఎస్‌కే వరుస విజయాలు సాధిస్తున్నా.. రుతురాజ్ గైక్వాడ్ బ్యాటర్‌గా సత్తా చాటాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు.'వరుసగా రెండు విజయాలు కెప్టెన్‌గా రుతురాజ్‌కు పెద్ద ఊరటనిస్తుంది. కానీ అతను బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. అతను తిరిగి ఫామ్ అందుకోవాలంటే బ్యాటింగ్‌లో సాంకేతిక లోపాలను సరిచేసుకోవాలి. టీ20 అంటేనే దూకుడుగా ఆడటం అయినప్పటికీ.. రుతురాజ్ బౌలర్ లైన్ దాటి మరీ ముందుకు వచ్చి త్వరగా వికెట్ పారేసుకుంటున్నాడు. ఆయుష్ మాత్రే, సంజూ శాంసన్ తరహాలో గ్రౌండెడ్ షాట్స్ ఆడాలి. ఇన్నింగ్స్ ప్రారంభంలో కాస్త నిదానంగా వ్యవహరించి, బంతిని సరిగ్గా టైమింగ్ చేస్తూ ఎక్కువ సేపు క్రీజులో ఉంటే రుతురాజ్ తన ఫామ్‌ను తిరిగి పొందుతాడు. రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో నేనున్నా ఆందోళన చెందను. కెప్టెన్‌గా సాధించిన విజయాలు అతనిపై ఒత్తిడిని తగ్గిస్తాయి.'అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మరోవైపు వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ పుంజుకోవాలంటే ఎక్స్ ఫ్యాక్టర్ ఆటగాడు రావాలని అశ్విన్ తెలిపాడు. గతంలోనూ కేకేఆర్ ఇలాంటి పరిస్థితుల నుంచి పుంజుకొని విజేతగా నిలిచిందని గుర్తు చేశాడు. 'ప్రస్తుతం కేకేఆర్ జట్టుకు కొత్త శక్తి అవసరం. కేవలం పతిరానా వంటి స్టార్లపైనే ఆధారపడకుండా, డగౌట్‌లో ఉన్న కొత్త ప్రతిభను వెలికితీయాలి. కేకేఆర్ వద్ద తేజస్వి దహియా, ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ సౌరభ్ దూబే వంటి ప్రతిభావంతులు ఉన్నారు. వారికి అవకాశం ఇస్తే జట్టు రూపురేఖలు మారుతాయి. ఐపీఎల్ 2021లో వెంకటేష్ అయ్యర్ జట్టులోకి వచ్చి ఎలాగైతే ఊపు తెచ్చాడో.. ఇప్పుడు కూడా అలాంటి ఒక 'ఎక్స్-ఫాక్టర్' ఆటగాడు కేకేఆర్‌కు అవసరం.'అని అశ్విన్ స్పష్టం చేశాడు.

# వారణాసి కోసం దేవర సెట్స్?




సూపర్‌స్టార్ మహేష్ బాబు మరియు దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న 'వారణాసి' సినిమాపై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం వారణాసి టీమ్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' సినిమా కోసం వాడిన టెక్నికల్ బ్యాక్‌డ్రాప్‌ను ప్రత్యేకంగా అండర్ వాటర్/వాటర్ సెట్స్ వినియోగించబోతున్నట్లు తెలుస్తుంది. 'దేవర' సినిమాలోని సముద్రపు సన్నివేశాల కోసం హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద భారీ వాటర్ ట్యాంక్ సెట్‌ను, బ్లూ మ్యాట్ టెక్నాలజీతో రూపొందించారు. ఇప్పుడు అదే సెట్‌ను 'వారణాసి'లో గంగా నది నేపథ్యంలో వచ్చే కీలక సన్నివేశాల కోసం రీ-డిజైన్ చేసి వాడుతున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ షెడ్యూల్ విదేశాల్లో జరగాల్సి ఉంది. కానీ ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ ప్రయాణాలు రిస్క్ అని భావించిన రాజమౌళి, తెలివిగా ప్లాన్ మార్చి హైదరాబాద్‌లోనే షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ సెట్‌లో మహేష్ బాబుపై భారీ రివర్ ఛేజ్ మరియు కొన్ని హై-టెక్ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. 'దేవర'లో వాడిన అడ్వాన్స్‌డ్ సినిమాటోగ్రఫీ టెక్నిక్స్ మరియు వాటర్ షూట్ ఎక్స్‌పర్టీస్‌ను ఈ షెడ్యూల్ కోసం ఉపయోగిస్తున్నట్లు సమాచారం.

# కృష్ణావతారం మూవీ ట్రైలర్ విడుదల




మధురలోని అత్యంత పవిత్రమైన శ్రీ కృష్ణ జన్మభూమి వేదికగా 'కృష్ణావతారం' చిత్ర ట్రైలర్ గ్రాండ్‌గా విడుదలైంది. పవిత్ర పుణ్యక్షేత్రంలో వేలాది మంది భక్తుల సమక్షంలో జరిగిన ఈ వేడుకతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు హార్దిక్ గజ్జర్ విజువల్ వండర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రంలో శ్రీకృష్ణుడి పాత్రలో సిద్దార్థ్ గుప్తా నటిస్తుండగా, రాధగా సుష్మిత భట్, సత్యభామగా సంస్కృతి జయాన, రుక్మిణిగా నివాషిని కృష్ణన్ కనిపించబోతున్నారు. క్రియేటివ్‌ల్యాండ్ స్టూడియోస్ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు అథశ్రీకథ మోషన్ పిక్చర్స్ పతాకాలపై సజన్ రాజ్ కురుప్, శోభా సంత్, పూనమ్ ష్రాఫ్, పార్థ్ గజ్జర్ ఈ భారీ పౌరాణిక చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రకాష్ కపాడియా, రామ్ మోరి, హార్దిక్ గజ్జర్ స్క్రీన్‌ప్లే అందించగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ అయనక బోస్ అద్భుతమైన విజువల్స్ అందించారు. మొత్తం మూడు భాగాలుగా రాబోతున్న ఈ సినిమా మొదటి అధ్యాయం మే 7, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# ఒక్కో షోకు శ్రీముఖి రెమ్యునరేషన్ ఎంతో తెలుసా?


## నెలకు అన్ని లక్షల ఆదాయమా?



ఈటీవీ ప్రోగ్రాం పటాస్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంది శ్రీముఖి. అంతకు ముందు జులాయి, నేను శైలజ వంటి సినిమాల్లో హీరో, హీరోయిన్లకు అక్కగా, చెల్లిగా నటించిన ఈ ముద్దుగుమ్మ బుల్లితెర ప్రోగ్రామ్స్ తోనే బాగా పాపులర్ అయ్యింది. ఓ వైపు గ్లామర్ తో ఆకట్టుకుంటూనే మరోవైపు సందర్భానికి తగ్గట్టుగా గలగలా మాట్లాడడం, కామెడీ పంచులు వేయడం ఈ ముద్దుగుమ్మ స్పెషల్ ట్యాలెంట్. అందుకే బిగ్ బాస్ వంటి రియాలిటీ షోలోనూ ఈ అందాల తార సత్తా చాటింది. రన్నరప్ గా నిలిచి తన క్రేజ్ ను అమాంతం పెంచుకుంది. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత టెలివిజన్ ప్రోగ్రామ్స్ మాత్రమే కాకుండా, సినిమా ఆడియో ఫంక్షన్లు, ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, ప్రైవేట్ ఓపెనింగ్స్ తో బాగా బిజీ బిజీగా మారిపోయింది శ్రీముఖి. అదే సమయంలో క్రేజీ అంకుల్స్, మ్యాస్ట్రో, భోళాశంకర్ తదితర సినిమాల్లోనూ నటించి మెప్పించిందీ అందాల తార. మొత్తానికి ఇప్పుడు బుల్లితెరపైనా, అప్పుడప్పుడు వెండితెరపైనా మెరుస్తూ మస్త్ బిజీగా ఉంటోందీ అందాల తార. ఇదే క్రమంలో తన క్రేజ్, పాపులారిటీకి తగ్గట్టుగానే రెమ్యునరేషన్ ను తీసుకుంటోంది. ప్రస్తుతం ఒక్క షో, ఈవెంట్ కోసం శ్రీముఖి దాదాపు రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లేదా ఫంక్షన్ హోస్ట్ చేయాలంటే ఆమె కనీసం రూ. 1.5 లక్షల నుండి రూ. 2.5 లక్షల మధ్య పారితోషికం తీసుకుంటుందని సమాచారం. ప్రస్తుతం ఈటీవీ, స్టార్ మా వంటి ఛానెళ్లలోని పలు ప్రోగ్రామ్స్ కు హోస్ట్ గా వ్యవహరిస్తోంది శ్రీముఖి. అలాగే నెలకు కనీసం 3 నుంచి 4 సినిమా ఈవెంట్లను కూడా హోస్ట్ చేస్తోంది. ఈ లెక్కన శ్రీముఖి నెలవారీ ఆదాయం సుమారు రూ. 20 లక్షల నుండి రూ. 30 లక్షల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఈ బ్యూటీకి ఉన్న క్రేజ్, పాపులారిటీ దృష్ట్యా నిర్మాతలు కూడా ఆమె అడిగింది ఇచ్చేందుకు ఏ మాత్రం వెనకాడడం లేదు.

# ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి

### భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి




రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నేసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# కృష్ణావతారం మూవీ ట్రైలర్ విడుదల

మధురలోని అత్యంత పవిత్రమైన శ్రీ కృష్ణ జన్మభూమి వేదికగా 'కృష్ణావతారం' చిత్ర ట్రైలర్ గ్రాండ్‌గా విడుదలైంది. పవిత్ర పుణ్యక్షేత్రంలో వేలాది మంది భక్తుల సమక్షంలో జరిగిన ఈ వేడుకతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు హార్దిక్ గజ్జర్ విజువల్ వండర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రంలో శ్రీకృష్ణుడి పాత్రలో సిద్దార్థ్ గుప్తా నటిస్తుండగా, రాధగా సుష్మిత భట్, సత్యభామగా సంస్కృతి జయాన, రుక్మిణిగా నివాషిని కృష్ణన్ కనిపించబోతున్నారు. క్రియేటివ్‌ల్యాండ్ స్టూడియోస్ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు అథశ్రీకథ మోషన్ పిక్చర్స్ పతాకాలపై సజన్ రాజ్ కురుప్, శోభా సంత్, పూనమ్ ష్రాఫ్, పార్థ్ గజ్జర్ ఈ భారీ పౌరాణిక చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రకాష్ కపాడియా, రామ్ మోరి, హార్దిక్ గజ్జర్ స్క్రీన్‌ప్లే అందించగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ అయనక బోస్ అద్భుతమైన విజువల్స్ అందించారు. మొత్తం మూడు భాగాలుగా రాబోతున్న ఈ సినిమా మొదటి అధ్యాయం మే 7, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




# సర్ మరో అవకాశం ఇవ్వండి

## బుచ్చిబాబు పోస్ట్.. వైరల్



ప్రస్తుతం అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ పెద్దితో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా రామ్‌చరణ్ 'ఎస్క్వైర్ ఇండియా' కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోల్లో చరణ్ స్టైలిష్ లుక్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. దీనికి దర్శకుడు బుచ్చిబాబు చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'సర్.. మరో అవకాశం ఇవ్వండి' అని సరదాగా కామెంట్ చేశారు. ఈ చిన్న కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీంతో 'పెద్ది' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని వార్తలు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ సినిమా తీయమంటూ అభిమానులు కూడా రిప్లైలు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ పెద్దిపై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమాలోని పాటలు ఆదరణను సొంతం చేసుకోవడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465